సర్కారు బడి @750 మంది విద్యార్థులు

- మేకలమండి పాఠశాలలో పెరుగుతున్న ప్రవేశాలు
- ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారం
- మెరుగైన విద్యాబోధనతో హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల



పాఠాలు వింటున్న విద్యార్థులు

బన్సీలాల్‌పేట్: ఒకప్పుడు ఆ స్థలం పబ్లిక్ మరుగుదొడ్ల ప్రాంతం. ప్రస్తుతం ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులను వెలిగిస్తున్న పవిత్ర స్థలం. కూలీనాలీ చేసుకుంటూ పొట్ట పోసుకునే పేద కుటుంబాల పిల్లలకు ఉచితంగా ఇంగ్లిష్ మీడియంలో విద్యను అందిస్తున్న భోలక్‌పూర్ క్రిష్టానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల. భోలక్‌పూర్, బోయిగూడ, ఐడీహెచ్ కాలనీ, బన్సీలాల్‌పేట్, మేకలమండి తదితర ప్రాంతాల విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎల్‌కేజీ, యూకేజీ నుంచి 7వ తరగతి వరకు సుమారు 750 మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. విద్యతో పాటు క్రీడలు, ఇతరత్రా రంగాల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు ఇక్కడి ఉపాధ్యాయులు.

అదనపు గదులకు రూ. 1.15 కోట్లు మంజూరు

విద్యార్థుల పెరుగుదలకు అనుగుణంగా తరగతి గదులు సరిపోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాధన సమితి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇటీవల రూ. 1.15 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో మరో 10 అదనపు తరగతి గదులు నిర్మించడానికి మార్గం సుగమమైంది. దీంతో పెరుగుతున్న విద్యార్థుల తాకిడికి ఈ అదనపు గదులు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయని ఉన్నత పాఠశాల సాధన సమితి కన్వీనర్ చంద్రశేఖర్, కో కన్వీనర్లు బి. నర్సింగ్‌రావు, వీజే శేషగిరి రావు, ఆర్. రాజుపేర్కొంటున్నారు. ఈ పాఠశాల అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తో పాటు నాడు హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు టి. పద్మారావు, ఎం. అంజన్‌కుమార్ యాదవ్, బండారు దత్తాత్రేయ, మర్రి శశిధర్‌రెడ్డి కూడా తమవంతు బాధ్యతగా నిధులు మంజూరు చేయించి చేయూతనిచ్చారు. ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం ఎమ్మెల్సీ వాణిదేవీతో ప్రత్యేకంగా మాట్లాడి ఆమె ఎమ్మెల్సీ కోటా నిధుల నుంచి రూ. 25లక్షలు మంజూరు చేయించారు.

'కార్పొరేట్'కు దీటుగా..

కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఇక్కడ విద్యను అందిస్తున్నారు. దీంతో ఎంతో పేద కుటుంబీకులు తమ పిల్లలను తీసుకువచ్చి ఇక్కడ చేర్పిస్తున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో వేలాది రూపాయలు చెల్లించి విద్యను అందించలేక అనేక మంది తల్లిదండ్రులు యూకేజీ, ఎల్‌కేజీలతో పాటు వివిధ తరగతుల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో ఉచితంగా విద్యను అందించడంతో పాటు అన్నీ కూడా ఉచితంగా ఇస్తుండటంతో ఈ పాఠశాలకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. అదే విధంగా స్వచ్ఛంధ సంస్థలకు చెందిన దాతలు ఈ పాఠశాలకు అన్ని విధాలా తోడ్పాటునందిస్తున్నారు.

మంచుకొండ ఫౌండేషన్ సహకారం..

ఇక్కడ చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా తెలంగాణ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చేర్పించడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షలకు మంచుకొండ ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు కావాల్సిన విద్యా సామగ్రిని కూడా ఉచితంగా అందిస్తున్నారు. ఈ పాఠశాల నుంచి ఇప్పటి వరకు సుమారు గురుకుల పాఠశాలకు సుమారు 250 మంది ఎంపికయ్యారు. 8 డిజిటల్ క్లాస్‌ల ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నారు. ఇక్కడి విద్యార్థులకు యోగా, మెడిటేషన్ వంటి రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. మంచుకొండ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో చదివే సుమారు 750 మందికి బ్యాగులు, షూ, టై, బెల్ట్‌లు అందజేస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో విద్యాబోధనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛంద సంస్థలకు చెందిన దాతల ఆర్థిక సహకారంతో పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన చేస్తున్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ పాఠశాలగా మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎంపికైయింది.

మా పిల్లల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు



ఈ పాఠశాల మాలాంటి పేదల పిల్లల విద్యావికాసానికి ఎంతో దోహదపడుతుంది. వేలాది రూపాయలు డబ్బులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించే స్తోమత మాకు లేదు. అయితే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడి ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తూ తమ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల ఇక్కడ సౌకర్యాలు, సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయి.

–రజిత, ఓ విద్యార్థి తల్లి

అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతూ పేద విద్యార్థుల విద్యా వికాసానికి కృషి చేస్తున్నాం. మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదుల నిర్మాణం కోసం రూ.1.15 కోట్లు మంజూరు చేయించాం. ఇక్కడ పేద కుటుంబాలకు చెందిన పిల్లలే ఎక్కువగా చదువుకుంటుండటంతో ఈ పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధతో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాం.

–మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

మెరుగైన విద్యాబోధన



మెరుగైన విద్యాబోధనతో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతున్నాం. ముఖ్యంగా ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ పాఠశాలను ఎంతో అభివృద్ధి చేస్తున్నాం. పాఠశాల అభివృద్ధికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారం మరువలేనిది. ఇక్కడ చదివే విద్యార్థులంతా కూడా కూలీ చేసుకుని కుటుంబీకుల పిల్లలే. చదువుతో పాటు ఇతర రంగాల్లో పిల్లలు రాణించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మంచుకొండ ఫౌండేషన్ పాఠశాలకు అందిస్తున్న చేయూత అభినందనీయం.

–మల్లికార్జున్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, ఆల్విన్, మైత్రీవనం, లోధా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్‌ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్‌లేన్, ఆంధ్రా బ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, చైతన్య జూనియర్ కాలేజ్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్, అల్లావుద్దీన్ కోఠి, ఓల్టాస్, టయోటా షోరూం లేన్, సనత్‌నగర్ ఫైర్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌ఎస్ బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, అమృతమాల్, జీఎస్ మాల్, ఐసీఐసీఐ బ్యాంక్, జయాగార్డెన్, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, డీ–మార్ట్ ఏరియా, టయోటా షోరూం లేన్, స్కోడా షోరూం లేన్, జెన్ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.83, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 95, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్ 68, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 35, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 21, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

బోనాల జాతర ఏర్పాట్లపై సమావేశం



బోనాల ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈఓ శ్రీనివాస్ శర్మ

రసూల్‌పురా: ఆషాఢమాస బోనాల జాతరలో భాగంగా ఈ నెల 23, 24 తేదీల్లో శ్రీదేవి దండుమారమ్మ బోనాల జాతరను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం. శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. బోనాల జాతర నిర్వహణ సందర్భంగా ఆలయ మాజీ ట్రస్ట్ సభ్యులు, భక్తులతో ఆదివారం ఆయన ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ప్రతియేడు లాగా బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానికులు ముప్పిడి గోపాల్, హీరాలాల్, క్రిష్ణ, రమేష్, సర్వేష్ జీవి. శ్రీనివాస్‌రావు, జేఈ క్రిష్ణ రావు పాల్గొన్నారు.

ప్రభాకర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న మహమూద్ అలీ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్ దశదిన కర్మ ఆదివారం ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించారు. మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మన్నె క్రిశాంక్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నాగేష్, మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు ప్రభాకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

కాకగూడలో బస్తీనిద్ర

కంటోన్మెంట్: ప్రజా ప్రతినిధులు లేని కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పాలన సజావుగా సాగడం లేదని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. ఐదో వార్డులోని కాకగూడలో 15వ బస్తీనిద్ర కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. బోర్డు ఎన్నికలు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నందున కంటోన్మెంట్‌లో ప్రజా పాలన జరగడం లేదన్నారు. కంటోన్మెంట్‌లో స్కైవేల నిర్మాణానికి కేంద్రం స్థలాలు ఇవ్వడం లేదని ఇదే విషయాన్ని మంత్రి కేటీఆర్ పలుమార్లు గుర్తు చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. బస్తీ లో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని బాగు చేసి పిల్లల కోసం ఆట స్థలం, బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలన్నారు. బాలకృష్ణ రవి, సత్యనారాయణ, నురేందర్, టింకు, మోహన్, అరవింద్, శశిధర్, శ్రీకాంత్, బంటి, మోని, రఘు, సాయి పాల్గొన్నారు.

నేడు చండీహోమం

నల్లకుంట: పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ దర్మాధికారి జయంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం జ్ఞాన సరస్వతి మాతకు అభిషేకం, అలంకరణ, విశేష పూజలు ఉంటాయన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం, పూర్ణాహుతి ఉంటుందన్నారు.

ఇంక్యుబేషన్ సెంటర్‌తో విద్యార్థులకు ప్రయోజనాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ

లాలాపేట: విద్యార్థుల మానసిక వికాసాన్ని ప్రతిబింబించడానికి ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ అన్నారు. ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ గ్రాండ్ ఫినాలేకు ఉస్మానియా యూనివర్సిటీ ఆతిథ్యం ఇచ్చింది. ఈ మేరకు ఓయూలోని సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ సెంటర్‌లో గతనెల జూన్ 10న నిర్వహించిన ఇండియాథాన్‌కు కొనసాగింపుగా ఫైనల్ ఈవెంట్ జరిగింది. దీని ద్వారా విద్యార్థి మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పర్చడం కోసం చాట్‌భాట్ కృషి ఇండియాథాన్ వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రొ.లక్ష్మీనారాయణ పాల్గొని ఐడియాథాన్ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్నల్ బి.ఎస్.రావు, డా. యుకే చౌదరీ, ప్రొ. విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దేవి డీలక్స్ మెస్‌లో అగ్ని ప్రమాదం



వెలువడుతున్న పొగ

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే దేవి డీలక్స్ మెస్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం ఉదయం 10 ప్రాంతంలో వంటగదిలో కట్టెల పొయ్యిపై వంటలు చేస్తున్న సమయంలో చిమ్నీలోని ఆయిల్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. దీనికి తోడు పక్కనే డబ్బాలో కొంత డీజిల్ కూడా ఉండటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో వంటగదిలోని కొంత సామగ్రి కాలిపోయింది. స్థానిక కార్పొరేటర్ కొంత దీపిక ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే హోటల్ సెల్లార్‌లో కొనసాగుండటంతో ఖాళీ చేయాలని గత కొన్ని రోజుల క్రితమే నోటీసులు ఇచ్చినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు.

రక్తదానంపై అవగాహన అవసరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న నాయకులు

చిలకలగూడ: ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించి రక్తదానంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశరావు అన్నారు. ముఫిద్ సొసైటీ నిర్వాహకులు సోహేల్, అక్రమ్ నేతృత్వంలో చిలకలగూడ బడే మసీదు వద్ద ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారి కోసం రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీతో పాటు తామంతా అండగా ఉంటామన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్, జ్ఞాపికలను అందించారు. ఈ శిబిరంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మార్ శ్రీనివాస్, జగ్గు, సురేష్‌లాల్, వహీదుద్దీన్, జాఫర్, అభిషేక్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. 'గృహలక్ష్మి'

- ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఆర్థిక సహాయం
- ఒక్కో నియోజకవర్గానికి 3 వేల మంది లబ్ధిదారులు
- ఎమ్మెల్యే ద్వారా కలెక్టర్‌కు జాబితా అందజేత



నందినగర్‌లోని రేకుల నివాసం

బంజారాహిల్స్: సొంతిల్లు నిర్మించుకోవాలని ప్రతిఒక్కరూ ఆశిస్తారు. అయితే పేదలు ఇల్లు కట్టుకోలేని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతుంటాయి. చాలా మందికి దశాబ్దాలుగా సొంతింటి కల నెరవేరడం లేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నా నగర పేదలకు పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. అయితే సొంత జాగా ఉన్న వారు ఇల్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పేరిట ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చింది. ఇందుకోసం జీఓ 25 విడుదల చేసింది. ఇప్పటికే ఈ పథకం కింద అర్హులు ఎవరెవరు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో అర్హులైన పేదలు ఈ పథకంలో లబ్ధి పొందనున్నారు. నియోజకవర్గానికి 3 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యతను అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సోమాజిగూడ, హిమాయత్‌నగర్, వెంకటేశ్వర కాలనీ డివిజన్లతో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళ్‌రావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో మొత్తం 6 వేల మందికి లబ్ధి చేకూరనుంది. ఆధార్ కార్డు ద్వారా స్థానికతను గుర్తిస్తారు. ఈ పథకం కింద ఇచ్చే రూ.3 లక్షలు వందశాతం సబ్సిడీ మళ్లీ తిరిగి కట్టాల్సిన అవసరం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల ఇళ్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా ఒక్కో నియోజకవర్గంలో 3 వేల ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందనుంది. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలు ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కలిగించారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

గృహలక్ష్మికి మార్గదర్శకాలు

- మహిళ పేరు మీదే ఇల్లు మంజూరు.
- తెల్లరేషన్ కార్డు, సొంత జాగా ఉంటేనే అర్హులు.
- రెండు రూమ్‌లు, ఒక టాయ్‌లెట్‌తో నిర్మాణం.
- ఇంటి మీద గృహలక్ష్మి లోన్.
- జీవో 59 ద్వారా లబ్ధి పొందిన వారు అనర్హులు.
- కలెక్టర్‌కు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలి.
- ఎమ్మెల్యేలు కూడా కలెక్టర్‌కు అర్హుల జాబితా పంపించవచ్చు.
- అప్లికేషన్ ఫైనల్ చేసే బాధ్యత కలెక్టర్‌దే.
- దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తారు.
- ఇల్లు రాని వాళ్లను వెయిటింగ్ లిస్ట్‌గా పరిగణిస్తారు.
- క్షేత్రస్థాయి తనిఖీలు, బిల్లుల పరిశీలన, బిల్లుల అప్రూవల్స్, బిల్లుల విడుదల అన్నీ కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ కమిషనర్, స్టేట్ నోడల్ అకౌంట్ నుంచి లబ్ధిదారుల ఖాతాకు బదిలీచేస్తారు.
- పథకం అమలుకు సీజీజీ ద్వారా ప్రత్యేకంగా మొబైల్ యాప్ పోర్టల్.
- ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే పథకం అమలు
- మూడు దశల్లో రూ.లక్ష చొప్పున సహాయం.
- బేస్‌మెంట్ లెవల్, శ్లాబ్, ఇల్లు పూర్తి అయిన తర్వాత అన్ని ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.
- ఈ స్కీం కోసం మహిళల పేరు మీదనే ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా ఓపెన్ చేయాలి.
- ఇతర లావాదేవీల కోసం ఈ బ్యాంకు అకౌంట్‌ను ఉపయోగించవద్దు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్




స్టామ్‌వాటర్ లైన్ పనులను ప్రారంభించిన మంత్రి తలసాని

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మోండా మార్కెట్ మారుతీ వీధిలో రూ. 39 లక్షల వ్యయంతో చేపడుతున్న స్ట్రామ్ వాటర్ లైన్ పనులను ఆదివారం ఆయన కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలెదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. మారుతీవీధిలో ఎన్నో ఏళ్ల తరబడి నుంచి ఉన్న డ్రైనేజీ సమస్యను ఇటీవల పరిష్కరించడం జరిగిందన్నారు. మోండా మార్కెట్ చుట్టూ పక్కల ప్రాంతాల్లో రోడ్లను బ్రహ్మండంగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఆల్ఫా హోటల్ నుంచి బాటా వరకు అదే విధంగా రాజేశ్వర్ థియేటర్ రోడ్లను ఎంతో అందంగా తీర్చిదిద్దామన్నారు.పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్‌ఎస్ నాయకులు నాగులు, జయరాజ్, ఒదేల సంత్యనారాయణ, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం..

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని మంత్రి తలసాని అన్నారు. ఆదివారం మారేడుపల్లిలో రూ.26.90 లక్షలతో సీసీ రోడ్డు, రెజిమెంటల్‌బజార్‌లోని మనోహర్ థియేటర్ వెనుక రూ.11.70 లక్షలతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు వెనుకాడబోదని తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సమస్యలు పరిష్కారం కావని కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకుని రావాలని ప్రతిపక్షాలకు హితవుపలికారు. ఈ కార్యక్రమంలో బీవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేష్, డీసీ ముకుంద్‌రెడ్డి, కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, లాస్య నందిత, ఈఈ సుదర్శన్, జలమండలి సీజీఎం ప్రభు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో ఇంటింటికీ బీజేపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని 172వ బూత్ పరిధిలో 'ఇంటింటికి బీజేపీ' కార్యక్రమాన్ని ఆ పార్టీ నేతలు ఆదివారం నిర్వహించారు. మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల మహేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని నేతలు స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలు నేడు భారత్‌ను అనుసరిస్తున్నాయంటే మోదీ పాలనే కారణమన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి తీసుకురావడం ద్వారా ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి నర్సింగరావు, కుషల్‌కుమార్, కుందనం మోహన్, చారి, అర్జున్, జ్ఞానేశ్వర్, జ్ఞాని పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో సాయి పంచఫల రసాభిషేకం



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సాయిబాబా దేవాలయంలో సాయి సప్తాహ ఉత్సవాల్లో ఆరవ రోజైన ఆదివారం సాయి పంచఫలరసాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిరిడీ సాయి వ్రతాలను సామూహికంగా నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం సాయిలక్ష్మీనరసింహా సేవ కనుల పండువగా సాగింది. ఈ నెల 3 సోమవారం దేవాయలంలో సాయిసప్తాహ ముగింపు ఉత్సవాలతో పాటు గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయం కార్యదర్శి బి. చలువరాయనంద తెలిపారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి నాయకులు

అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అండగా ఉంటుందని సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు రూబి స్టివెన్‌సన్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో ఉద్యమ గాయకుడు సాయిచంద్, ప్రవీణ్‌కుమార్‌ల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రూబి స్టివెన్‌సన్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమరుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సాయిచంద్ తన ఉద్యమ పాటలతో తెలంగాణ సమాజాన్ని ఎంతో చైతన్యం చేశారన్నారు. ప్రభుత్వం ప్రత్యేక పథకంతో ఉద్యమకారులకు చేయూతనివ్వాలన్నారు. హైదరాబాద్ జిల్లా టీజేఏసీ మాజీ సమన్వయకర్త రామగిరి ప్రకాష్, సంజీవచారి, సుధాకర్, తిరుమలరావు, సత్యనారాయణ, శశిధర్, రాజమహేందర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌ప్రసాద్ గౌడ్, రాంచందర్ , బంగారు శ్రీనివాస్ తదితరులున్నారు.